సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం ¸ 25 ¸ ఏప్రిల్ ¸ 2024

I



కొనుగోళ్లు వేగవంతం చేయాలి

ధాన్యం కొనుగోళ్లు వేగిరం చేయాలని సివిల్ సప్లయ్ కమిషనర్ చౌహాన్ అన్నారు. - IIలో



వైభవంగా శతఘటాభిషేకం

శ్రీలక్ష్మీనరసింహస్వామి జన్మ నక్షత్రం సందర్భంగా బుధవారం శతఘటాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. - IIIలో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 42° / 25°

ఆకాశం మేఘావృతమై ఉంటుంది, మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

భరోసా యాత్ర

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో కేసీఆర్ బస్సుయాత్ర, రోడ్‌షో

- బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించిన కేసీఆర్
- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను గోసపెడుతున్నదని విమర్శ
- ప్రజల బలంతో పోరాడుతానని చెప్పిన బీఆర్‌ఎస్ అధినేత
- అడుగడుగునా పార్టీ శ్రేణుల నీరాజనం, భారీగా స్వాగత ఏర్పాట్లు



మిర్యాలగూడలో రోడ్‌షోలో మాట్లాడుతున్న కేసీఆర్, చిత్రంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి కృష్ణారెడ్డి



సూర్యాపేట రోడ్‌షోలో మాట్లాడుతున్న కేసీఆర్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేట: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్ర ఉమ్మడి జిల్లాలో బుధవారం ప్రారంభమైంది. తమ ప్రభుత్వ హయాంలో చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ.. ప్రస్తుతం ప్రజలు ఎలా ఇబ్బందులు పడుతున్నారో చెప్పారు. రైతుల బాధలు విని.. వారికి భరోసా ఇచ్చారు. వారిని తమవైపు తిప్పుకునేలా మాటలు తూటాలు పేల్చారు. రైతుల ప్రయోజనాలను కాపాడడంలో జిల్లా మంత్రులు విఫలమయ్యారని దుయ్యబడుతూ.. బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తేనే రైతులకు భరోసా ఉంటుందన్న విషయాన్ని చెప్పుకొచ్చారు. ఒకప్పుడు నాగార్జునసాగర్ నుంచి ఎడమ కాలువకు ఎంత బాగా నీళ్లు వచ్చేవని, పంటలు ఎంత బాగా పండేవని, అది చూసిన తమకు సంతోషం వేసేదంటూనే, ఇప్పుడు రైతులు ఇబ్బందుల్లో పడ్డారని గుర్తుచేశారు. తమ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో 18 పంటలకు నీళ్లిచ్చామని, క్షణం కూడా కరెంటు పోకుండా సరఫరా చేశామని వివరించారు. కృష్ణా నదిలో నీళ్లు తక్కువైనా, నల్లగొండ జిల్లాకు శాశ్వతంగా నీటిని అందించేందుకు.. కాళేశ్వరం నీళ్లు తెచ్చి మూసీ నదిలో వేసి, అక్కడి నుంచి ఉదయ సముద్రానికి తెచ్చి, అక్కడి నుంచి పెద్దదేవులపల్లి రిజర్వాయర్‌కు తీసుకువచ్చేందుకు ప్రణాళికలను రచించామని చెప్పారు. ఇప్పుడు నీళ్లు, కరెంటు రెండూ బంద్ అయ్యాయని, రైతుబంధు ఇవ్వడం లేదని, ఇందుకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమనే విషయాన్ని రైతులకు తెలియజెప్పే ప్రయత్నం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని, నల్లగొండలో కంచర్ల కృష్ణారెడ్డిని 50 వేల మెజారిటీతో గెలిపించాలని కోరారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ నుంచి బయలుదేరిన కేసీఆర్ మిర్యాలగూడ, సూర్యాపేట రోడ్ షోలలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా నేతలు అడుగడుగునా ఆయనకు స్వాగతం పలికారు.

నీళ్ల కోసం ఉద్యమాలు చేశాను

ఆనాడు నీటి కోసం తాను అనేక ఉద్యమాలను చేశానని కేసీఆర్ చెప్పారు. 21 ఏళ్ల క్రితం తాను పాదయాత్రలో భాగంగా కోదాడ, హాలియా నుంచి మిర్యాలగూడకు వచ్చానని ఆనాడు తనకు భారీగా స్వాగతం పలికారని, ఇప్పుడు కూడా పెద్ద ఎత్తున స్వాగతం పలికారని అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో బంగారు తెలంగాణ అయితే.. కాంగ్రెస్ హయాంలో బాధల తెలంగాణగా మారిందన్నారు.

బీఆర్‌ఎస్‌కు తెలంగాణ ప్రజల బలం

బీఆర్‌ఎస్ బలం.. తెలంగాణ ప్రజల బలమని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. జగదీశ్‌రెడ్డి నాయకత్వంలో సూర్యాపేట పట్టణాన్ని బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకున్నామని, జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసుకుని మెడికల్ కాలేజీ తెచ్చుకున్నామని చెప్పారు. సద్దల చెరువు ముద్దుల చెరువుగా మారిందని కొనియాడారు. సూర్యాపేట పట్టణంలో కాంగ్రెస్ పాలనలో 30 ఏళ్లు మూసీ మురికి నీళ్లు తాగించారని ఆవేదన వెలిబుచ్చారు. బీఆర్‌ఎస్ పాలనలో మిషన్ భగీరథతో కృష్ణా జలాలను తెచ్చామని, దాన్ని నేటి పాలకులు నాశనం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ సెక్యులర్ పార్టీ అని, బీఆర్‌ఎస్‌తోనే ముస్లిం మైనార్టీలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, నల్లగొండ, సూర్యాపేట బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు రవీంద్రకుమార్, బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నలమోతు భాస్కర్‌రావు, నోముల భగత్, కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిషోర్‌కుమార్, తిప్పన విజయసింహారెడ్డి, నాయకులు చెరుకు సుధాకర్ తదితరులున్నారు.



సూర్యాపేట రోడ్‌షోలో అభివాదం చేస్తున్న కేసీఆర్

పవర్ ప్లాంటుకు పర్యావరణ అనుమతి శుభపరిణామం

రామగిరి(నల్లగొండ): తెలంగాణ ప్రజలకు బీఆర్‌ఎస్ పార్టీయే శ్రీరామరక్ష అని కేసీఆర్ అన్నారు. బస్సు యాత్రలో భాగంగా బుధవారం తిప్పర్తిలో మాట్లాడారు. భవిష్యత్ అవసరాల కోసం తమ ప్రభుత్వ హయాంలో దామరచర్ల వద్ద 4వేల మెగావాట్లతో పవర్ ప్లాంటు నిర్మాణం చేపట్టామని, ఆ ప్లాంటుకు పర్యావరణ అనుమతులు రావడం శుభవార్త అని అన్నారు. తక్షణమే పవర్ ప్లాంటు పనులు పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నీళ్లు, నిధులు, నియామకాల కోసమే కేసీఆర్ పోరాటం : జగదీష్‌రెడ్డి

మన నీళ్లు, నిధులు, నియామకాలు దక్కాలని, అందుకే తెలంగాణ రావాలని కేసీఆర్ పోరాటం చేశారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర సాధనే తన ధ్యేయమని ఉద్యమాన్ని ప్రారంభించి రాష్ట్రాన్ని సాధించారన్నారు. కేసీఆర్ చచ్చుడో.. తెలంగణ వచ్చుడోనని, చావునోట్లో తల పెట్టి పదేళ్లలో అద్భుతమైన బంగారు తెలంగాణకు బాటలు వేశారన్నారు. 120 రోజుల్లో ఏం జరిగిందో.. రాష్ట్రం కేసీఆర్ చేతిలో ఉంటే ఎలా ఉండేదో ఆలోచించాలన్నారు. రాత్రిపూట పొలాల వద్దకు వెళ్లకుండా పంట ఎలా పండించుకున్నారో ఆలోచించాలన్నారు.

అమ్మాయిలదే హవా

- ఇంటర్ ఫస్టియర్‌లో 48.67.. సెకండియర్‌లో 60.67 శాతం ఉత్తీర్ణత
- బాలికలు 63 శాతం, బాలురు 43 శాతంగా నమోదు



శ్రీహిత, సెకండ్ ఎంపీసీ 987 (చౌటుప్పల్)
రవీందర్, సెకండ్ బైపీసీ 986 (సర్వేల్)
ఉషశ్రీ, ఫస్ట్ ఎంపీసీ 467 (చౌటుప్పల్)
సింధుభార్గవి, ఫస్ట్ బైపీసీ 434 (చౌటుప్పల్)

భువనగిరి: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష ఫలితాల్లో బాలుర కంటే బాలికలు పైచేయి సాధించారు. గతేడాది ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాల కంటే ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం తగ్గిపోయింది. గతేడది ఫస్టియర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లాకు 19, సెకండియర్‌లో 22వ స్థానం దక్కింది. కానీ ఈసారి ఫస్టియర్‌లో రాష్ట్ర స్థాయిలో 26, సెకండియర్ ఫలితాల్లో 25వ స్థానంలో నిలిచింది.

11,867 విద్యార్థులకు..

జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, గురుకులాల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 11,867 మంది పరీక్షలు రాయగా 6,467 మంది పాసై ఈసారి 54.50 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 5,598 మందికి 2,456 మంది పాసై 43.87 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 6,269 మందికి 4,011 మంది పాసై 63.98 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్‌లో జనరల్, ఒకేషనల్ విభాగంలో బాలురు 2,884 మందికి 1,085 మంది (37.62 శాతం), బాలికలు 3,226 మందికి 1,889 మంది (58.56 శాతం) ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో బాలురు 2,714 మందికి 1,371 మంది (50.52 శాతం) బాలికలు 3,043 మందికి 2,122 మంది పాసై 69.73 శాతం ఉత్తీర్ణత సాధించారు. 2022–23లో 57 శాతం సాధించగా ఈసారి 54.50శాతం సాధించారు.. జిల్లాలో ఈసారి ఫస్టియర్‌లో 48.67శాతం, సెకండియర్‌లో 60.67 శాతం ఉత్తీర్ణత నమోదైందని డీఐఈఓ రమణి తెలిపారు.

నేడు భువనగిరికి కేసీఆర్ రాక

సాక్షి, యాదాద్రి: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సు యాత్ర, రోడ్ షో గురువారం భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కొనసాగనుంది. గురువారం ఆయన సూర్యాపేట నుంచి బస్సు యాత్రగా బయలుదేరి కేతేపల్లి, నకిరేకల్ బైపాస్, నార్కట్‌పల్లి బైపాస్, చిట్యాల ఎక్స్ రోడ్డు, రామన్నపేట, వలిగొండ, భువనగిరి రూరల్ మండలం, భువనగిరి బైపాస్ మీదుగా కలెక్టరేట్ నుంచి సాయిబాబ గుడి వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి ర్యాలీగా వినాయక చౌరస్తా వద్దకు వస్తారు. రోడ్ షోలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం అక్కడి నుంచి ఎర్రవెల్లి ఫాం హౌజ్‌కు చేరుకుంటారు. ఈ బస్సు యాత్రలో బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామమల్లేష్, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు పాల్గొననున్నారు. భువనగిరిలో జరగనున్న రోడ్ షోను విజయవంతం చేయడానికి పార్టీ ముఖ్య నాయకులు భారీ జన సమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

20 మంది నామినేషన్లు



నామినేషన్ వేస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యేలు వీరేశం, ఐలయ్య, సామేలు, అనిల్

భువనగిరి టౌన్: భువనగిరి లోక్‌సభ స్థానానికి బుధవారం 20 మంది అభ్యర్థులు 23 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సీపీఎం నుంచి అనురాధ, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా క్యామ మల్లేష్ నామినేషన్లు సమర్పించారు. అలాగే వివిధ పార్టీలు, స్వంత్రులు మరో 17 మంది తమ నామినేషన్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జండగేకు సమర్పించారు.

నల్లగొండలో 22 మంది..

నల్లగొండ: నల్లగొండ లోక్‌సభ స్థానానికి బుధవారం 22 మంది అభ్యర్థులు 28 సెట్ల నామినేషన్‌లు దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా కుందూరు రఘువీర్‌రెడ్డి, కాంగ్రెస్ తరపున కుందూరు జానారెడ్డి, బీజేపీ నుంచి సూకల నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి కంచర్ల కృష్ణారెడ్డి మరో సెట్ నామినేషన్లు వేశారు. అలాగే మరో 18 మంది ఇతర పార్టీలు, స్వతంత్రులు తమ నామినేషన్లను జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందనకు సమర్పించారు.

నామినేషన్లకు నేడే ఆఖరు

- ఇప్పటికి భువనగిరి స్థానానికి 67 నామినేషన్లు
- 29 తర్వాత తేలనున్న బరిలోని అభ్యర్థుల పేర్లు

సాక్షి, యాదాద్రి: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ఘట్టం చివరి అంకానికి చేరుకుంది. గురువారంతో నామినేషన్ల గడువు ముగియనుంది. ఈనెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. బుధవారం వరకు 67 నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి రోజు మరికొన్ని నామినేషన్లు దాఖలు కానున్నాయి. ఈనెల 29న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత పోటీలో ఎంతమంది అభ్యర్థులు ఉంటారో తేలనుంది.

హంగు ఆర్భాటాలతో నామినేషన్లు

భువనగిరి లోక్‌సభ స్థానానికి ప్రధాన పార్టీలు హంగు ఆర్భాటాలతో నామినేషన్లు దాఖలు చేశాయి. ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. 19న సీపీఎం అభ్యర్థి ఎండీ.జాహంగీర్, 22న బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేష్, 23న బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ నామినేషన్లు దాఖలు చేశారు. కాగా కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. అయితే ప్రధాన పార్టీల అభ్యర్థులు మాత్రం ఎన్నికల ప్రచారంలో భాగంగా నామినేషన్ల కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. దీంట్లో భాగంగా జిల్లా కేంద్రమైన భువనగిరిలో తమతమ పార్టీల ముఖ్య నాయకులతో కలిసి రోడ్ షోలు, బహిరంగ సభలు, కార్నర్ మీటింగ్‌లు, ర్యాలీలు నిర్వహించారు.

కేసీఆర్ బస్సు యాత్ర


మాడుగులపల్లి శివారులోని విడిది హోటల్‌లో బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులతో కలిసి స్నాక్స్ తింటున్న మాజీ సీఎం కేసీఆర్


మిర్యాలగూడ పట్టణంలో కేసీఆర్ బస్సుయాత్ర


తిప్పర్తిలో బస్సులో నుంచి కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న కేసీఆర్


సూర్యాపేటలో కేసీఆర్ బస్సు యాత్రలో డ్యాన్స్ చేస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు


సూర్యాపేటలో కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతున్న మాజీ సీఎం కేసీఆర్

సొంత కారు లేని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేయగా.. తనకు సొంత కారు లేదని ఎన్నికల అఫిడవిట్లో పేర్కొన్నారు. తన భార్య డింపుల్‌రెడ్డి పేరున మారుతీ బెలేనో కారు ఉందని చూపించారు. ఆయన స్థిర, చరాస్తుల మొత్తం విలువ రూ.28,72,11,468గా అఫిడవిట్‌లో ఉన్నాయి. తన పేరున 862 గ్రాముల బంగారం, భార్య పేరున 1022 గ్రాముల బంగారం ఉందని పేర్కొన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి చేతిలో రూ.2,59,650, తన భార్య చేతిలో రూ.1,06,750 నగదు ఉన్నట్లు చూపించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి పేరున స్థిరాస్తుల ఆస్తుల విలువ రూ.12,30,35,500 కాగా, తన భార్య డింపుల్‌రెడ్డి పేరున రూ.7,17,45,500 స్థిరాస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో చూపించారు. భార్యాభర్తల పేరున ఉన్న మొత్తం స్థిరాస్తుల విలువ రూ.19,47,81,000. కిరణ్‌కుమార్‌రెడ్డి పేరిట చరాస్తులు రూ.7,63,79,660, భార్య పేరిట రూ.1,60,50,808 చరాస్తులు ఉన్నాయి. కిరణ్‌కుమార్‌రెడ్డి పేరు మీద అప్పులు రూ.35,53,937, తన భార్య పేరున రూ.37,94,436 అప్పులు ఉన్నాయి.

మూడు పోలీస్ కేసులు..

చామల కిరణ్‌కుమార్‌రెడ్డిపై మూడు పోలీస్ కేసులు ఉన్నాయి. 200 గజాల స్థలం ఆక్రమణకు సంబంధించి రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో, గాంధీభవన్ ముందు ధర్నాకు సంబంధించి హైదరాబాద్‌లోని బేగంబజార్ పోలీస్ స్టేషన్‌లో, జాతీయ రహదారిపై రాస్తారోకోకు సంబంధించి శాలిగౌరారం పోలీస్ స్టేషన్‌లో తనపై కేసులు నమోదైనట్లు ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

కుందూరు రఘువీర్‌రెడ్డి ఆస్తులు రూ.32 కోట్లు

నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి తన పేరిట రూ.32,04,23,749 ఆస్తులు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో చూపించారు. అందులో ఆయన పేరున రూ.24,84,20,025 ఆస్తులు ఉండగా.. తన భార్య పేరున రూ.7,20,03,724 ఆస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. రఘువీర్‌రెడ్డి వివిధ బ్యాంకుల్లో రూ.17,41,50,500 అప్పు తీసుకున్నట్లు చూపగా.. భార్య పేరున రూ.25,29,000 అప్పులు ఉన్నట్లుగా చూపించారు.

ప్రజా సేవ చేసేలా దీవించాలని వేడుకున్నా


యాదాద్రీశుడి చెంత నామినేషన్ పత్రాలతో చామల, పక్కన ఎమ్మెల్యేలు ఐలయ్య, వీరేశం

- కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

యాదగిరిగుట్ట: ప్రజా సేవ చేసేలా దీవించాలని యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని వేడుకున్నట్లు కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి యాదాద్రీశుడి చెంత నామినేషన్ పత్రాలకు పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేవుడి ఆశీస్సులు, ప్రజల దీవెనలతో భువనగిరిలో మరోసారి కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామన్నారు. యాదాద్రీశుడి ఆశీస్సులతో భారీ మెజార్టీతో భువనగిరి ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ గెలుస్తుందని, దేశంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కేసీఆర్‌ను గల్లీ గల్లీ తిప్పుతున్న రేవంత్‌రెడ్డి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య


మాట్లాడుతున్న బీర్ల ఐలయ్య, పక్కన చామల, ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్‌రెడ్డి, వీరేశం, సామేల్

భువనగిరి టౌన్: అధికారం పోయిన తర్వాత అసెంబ్లీలో అడుగుపెట్టని కేసీఆర్‌ను గల్లీ గల్లీ తిరిగేటట్లు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదే అని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ ఓట్ల కోసం బస్సు యాత్ర అంటూ మళ్లీ మోసం చేయటానికి సిద్ధమయ్యాడని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు కచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటం కోసం ప్రతిఒక్కరూ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలన్నారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిన బీఆర్‌ఎస్ పార్టీకి ఇప్పుడు రుణమాఫీపై మాట్లాడే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, భువనగిరి మున్సిపాలిటీ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, టీపీసీసీ సభ్యుడు తంగళ్లపల్లి రవికుమార్, కాంగ్రెస్ నాయకులు కూర వెంకటేశం, సామా మధుసూదన్‌రెడ్డి, కుక్కదువు సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని సభా స్థలం పరిశీలన

చౌటుప్పల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో చౌటుప్పల్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది. ఈ మేరకు చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామ పరిధిలోని జాతీయ రహదారి సమీపంలో, వలిగొండ రోడ్డులో ఎస్. లింగోటం గ్రామం వద్ద, చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో గల ఎంఎంఆర్ కళాశాల స్టేడియాన్ని బీజేపీ నాయకులు బుధవారం పరిశీలించారు. రాష్ట్ర పార్టీ పరిశీలకులు వచ్చి స్థలాలను పరిశీలించాక తుది స్థలాన్ని ఖరారు చేయనున్నట్లు తెలిసింది. మే 1, 3, 5 తేదీల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటించనున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. ఆ మూడు రోజుల్లో ఏదో ఒక తేదీలో ప్రధానితో ఇక్కడ సభ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఒకట్రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి.


స్థలాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

కదిలొచ్చిన కాంగ్రెస్ శ్రేణులు

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024


ర్యాలీగా వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, (ఇన్‌సెట్‌లో) నామినేషన్ వేసేందుకు స్కూటీపై వెళ్తున్న కుందూరు రఘువీర్‌రెడ్డి


మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

- భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేసిన కుందూరు రఘువీర్‌రెడ్డి
- పాల్గొన్న మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు


క్లాక్‌టవర్ సెంటర్‌లో ర్యాలీకి స్వాగతం పలుకుతున్న సీపీఎం, సీపీఐ నాయకులు

నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నల్లగొండ పట్టణంలో నిర్వహించిన భారీ ర్యాలీలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఉదయం 10.30 గంటలకు వీటీ కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో రఘువీర్‌రెడ్డి పూజలు నిర్వహించి, అక్కడి నుంచి ర్యాలీగా గడియారం సెంటర్‌కు చేరుకున్నారు. గడియారం సెంటర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులతో పాటు రఘువీర్‌రెడ్డిని కాంగ్రెస్ కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. అనంతరం రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే రఘువీర్‌రెడ్డి గెలుపు ఖాయమైందని, మెజార్టీ కోసమే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఒక్క నల్లగొండ నియోజకవర్గంలోనే లక్ష మెజార్టీ వచ్చే విధంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. ప్రధాని మోదీ కంటే నల్లగొండ అభ్యర్థికే ఎక్కువ మెజార్టీ రావాలన్నారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సముచిత ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోనే నల్లగొండ ఎంపీగా రఘువీర్‌రెడ్డిని ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కుటుంబ సమేతంగా వెళ్లి చెయ్యి గుర్తుకు ఓటేయాలన్నారు. గత ఐదేళ్లలో తాను, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎంపీలుగా ఉండి కేంద్రం నుంచి అధిక నిధులు తీసుకొచ్చామన్నారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగమార్గంతో పాటు బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు, మిగతా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తామని చెప్పారు. ఎన్నికల తర్వాత కొత్త రేషన్‌కార్డులు ఇస్తామన్నారు. నల్లగొండ నియోజకవర్గంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, ఆ అభివృద్ధిని చూస్తుంటే ఈర్ష్య కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కుందూరు జానారెడ్డి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, జైవీర్ రెడ్డి, బాలునాయక్, సీపీఎం, సీపీఐ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వంగూరి లక్ష్మయ్య, ఇంతియాజ్, అబ్బగోని రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సెక్టోరల్ అధికారుల శిక్షణపై దృష్టి సారించాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హరిచందన, అధికారులు

నల్లగొండ: సెక్టోరల్ అధికారుల శిక్షణపై దృష్టి సారించాలని నల్లగొండ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన అన్నారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, డిప్యూటీ సీఈఓలు సర్ఫరాజ్ అహ్మద్, లోకేష్‌కుమార్ హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో లోకసభ ఎన్నికల నిర్వహణపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం ఆమె మాట్లాడారు. గురువారం చివరి రోజు నామినేషన్ల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ తదితర అంశాలపై ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, చిన్న చిన్న విషయాల్లో ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన నివేదికలు సకాలంలో పంపించడంపై దృష్టి సారించాలని, ఈవీఎంల ర్యాండమైజేషన్‌లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్‌ఓ డి. రాజ్యలక్ష్మి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి శ్రీదేవి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటు హక్కుపై ఫొటో ఎగ్జిబిషన్

నల్లగొండ: కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై గురువారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకు ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు జిల్లా క్షేత్ర ప్రచార అధికారి జి.కోటేశ్వర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను గురువారం ఉదయం 9.30 గంటలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరిచందన ప్రారంభిస్తారని పేర్కొన్నారు. తొలిసారి ఓటు వేయబోతున్న యువతకు ఎన్నికల మొబైల్ యాప్‌ల వినియోగం, అవినీతికి తావులేని ఓటు హక్కు వినియోగం, ఎన్నికల చరిత్రపై ఛాయా చిత్ర ప్రదర్శన ఉంటుందన్నారు. నూతనంగా ఓటు హక్కు పొందిన వారు, ఓటర్లు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

- సీపీఎం, సీపీఐ నాయకుల మద్దతు కోరిన మాజీ మంత్రి జానారెడ్డి


రఘువీర్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్న సీపీఎం నాయకులు


రఘువీర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి తదితరులు

నల్లగొండ టౌన్: కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి, తన కుమారుడు కుందూరు రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి సీపీఎం శ్రేణులను కోరారు. బుధవారం జానారెడ్డి తన కుమారుడు రఘువీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌తో కలిసి నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య భవన్‌కు వెళ్లి సీపీఎం నాయకుల మద్దతు కోరారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పి కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. తమకు, కాంగ్రెస్ పార్టీకి సిద్ధాంతపరంగా తేడాలు ఉన్నప్పటికీ బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ఓడించడానికి కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలని నిర్ణయించామన్నారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో మాత్రమే తమ అభ్యర్థిని బరిలో ఉంచుతున్నామని, రాష్ట్రంలోని మిగతా 16 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు. ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనను భారీ మెజార్టీతో గెలిపించడానికి కలిసి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, మల్లు లక్ష్మి, నారి అయిలయ్య, తుమ్మల వీరారెడ్డి, తుమ్మల పద్మ, పాలడుగు నాగార్జున, ప్రభావతి, సయ్యద్ హాషం, చావా కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించాలి

దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బీజేపీని లోక్‌సభ ఎన్నికల్లో ఓడించి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ బుధవారం నల్లగొండ పట్టణంలోని సీపీఐ కార్యాలయానికి వెళ్లి లోక్‌సభ ఎన్నికల్లో రఘువీర్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో సీపీఐ, కాంగ్రెస్ పార్టీలు కలిసి పనిచేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, గన్న చంద్రశేఖర్, సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, పల్లా దేవేందర్ రెడ్డి, ఎల్.శ్రవణ్‌కుమార్, మల్లెపల్లి ఆదిరెడ్డి, పబ్బు వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్


ధాన్యాన్ని మ్యాచర్‌తో చెక్ చేస్తున్న కమిషనర్ డీఎస్ చౌహాన్

ఆలేరు రూరల్: జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ ఆదేశించారు. బుధవారం ఆలేరు మార్కెట్ యార్డ్‌లో ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. యార్డులో రికార్డులను పరిశీలించి అక్కడ ధాన్యం అమ్మిన రైతుకు ఫోన్ ద్వారా సంప్రదించి డబ్బులు ఖాతాలోకి జమ అయ్యాయా లేదా అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్ల తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందవాలని, ధాన్యం కొన్న మూడు రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని తెలిపారు. అకాల వర్షాలకు భయపడి రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ దళారులకు ధాన్యం అమ్మవద్దని సూచించారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని తగినన్ని టార్పాలిన్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజూ జిల్లా అధికారులతో సమీక్ష ద్వారా సమస్యలు తెలుసుకుంటున్నామని తెలిపారు. ధాన్యం సేకరణలో ఏ విధంగా ఇబ్బందులు తలెత్తితే హెల్ప్‌లైన్ నంబర్ 1967ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.గోపికృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎం.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ఎంఏఓ దీప్తి, ఏఈఓ శివకుమార్, సెంటర్ ఇన్‌చార్జి స్వామి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

చౌటుప్పల్ : ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి పలువురి నుంచి డబ్బులతో ఉడాయించిన మోసగాడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ మేరకు బుధవారం స్థానిక కోర్టులో రిమాండ్ చేశారు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ... సంగారెడ్డి జిల్లా పెద్దశంకరంపేట మండల కేంద్రానికి చెందిన ఆకుల అజయ్‌కుమార్(37) అదే జిల్లాలోని పటాన్‌చెరువు మండలం ఇసానాపూర్ గ్రామంలోని లిటిల్‌ఫ్లవర్ ఆసుపత్రిలో కంపౌండర్‌గా పనిచేసేవాడు. 2022లో అజయ్‌కుమార్ చౌటుప్పల్‌కు వచ్చాడు. చిన్నకొండూర్ రోడ్డులో ఉన్న గౌరీదేవి ఉషారాణికి చెందిన ఆసుపత్రికి వెళ్లాడు. తాను డాక్టర్‌నని పరిచయం చేసుకుని ఆసుపత్రి లీజుకు తీసుకున్నాడు. అందులో భాగంగా ఆసుపత్రిలో పనిచేసే ఇద్దరు నర్సులకు మాయమాటలు చెప్పాడు. తాను సికింద్రాబాద్‌లోని రైల్వే ఆసుపత్రిలో పనిచేస్తున్నానని నమ్మించాడు. తన బంధువు అక్కడే రైల్వేలో ఉద్యోగం చేస్తున్నాడని, గుర్తింపు కార్డులు చూపించాడు. అభ్యర్థులు కేవలం దరఖాస్తు చేసుకొని పరీక్షరాస్తే ఉద్యోగం వచ్చేలా చేస్తామని నమ్మబలికాడు, ఆ ప్రకారంగా 17మంది బాధితుల నుంచి రూ.17లక్షల 40వేలు వసూలు చేశాడు. అనంతరం అక్కడి నుంచి కుటుంబంతో కలిసి పారిపోయాడు. ఆ తర్వాత మోసపోయామని తెలుసుకున్న బాధితులు లబోదిబోమన్నారు. ఈ మేరకు ఆసుపత్రి యజమాని గౌరీదేవి ఉషారాణి అదే ఏడాది డిసెంబర్ 15న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు ఎట్టకేలకు నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థిని ప్రతిభ


భారత సిరి

భూదాన్‌పోచంపల్లి : ఇంటర్ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని భారత సిరి బుధవారం సత్తా చాటింది. శ్రీ మేధా ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ కోదాడలో చదువుతున్న భారత సిరి ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో 464 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది. ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని సిరిని తల్లిదండ్రులు, అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు.

బ్యాంక్ క్యాషియర్ అరెస్ట్


అనిల్‌కుమార్, క్యాషియర్

వలిగొండ: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్ క్యాషియర్ కాలేరు అనిల్‌కుమార్‌ను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మహేందర్ లాల్ తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడిన క్యాషియర్ అనిల్‌కుమార్ బ్యాంక్ నుంచి ఇటీవల రూ.15.50లక్షలతో ఉడాయించాడని ఎస్ఐ పేర్కొన్నారు. బుధవారం పని నిమిత్తం వలిగొండకు వచ్చిన అనిల్‌కుమార్‌ను బ్యాంకు అధికారుల సమాచారం మేరకు అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు. అతడు మొత్తం రూ.37.83లక్షలు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పెట్టినట్లు విచారణలో తెలిందని ఎస్ఐ పేర్కొన్నారు.

ఓటరు స్లిప్‌లు అందేలా చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, అదనపు కలెక్టర్లు, అధికారులు

భువనగిరి టౌన్: బూత్ స్థాయి అధికారుల ద్వారా ప్రతి ఓటరుకు ఓటర్ స్లిప్పు అందేలా చర్యలు తీసుకుటున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే తెలిపారు. నామినేషన్ల పరిశీలన, బ్యాలెట్ పేపర్ ముద్రణ, హోం ఓటింగ్, ఓటర్ స్లిప్పుల పంపిణీ తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ బుధవారం రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. నామినేషన్ల పరిశీలన నిబంధనల ప్రకారం పక్కాగా నిర్వహించాలని కలెక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే మాట్లాడారు. పోలింగ్ విధులలో పాల్గొనే సిబ్బందికి ఇప్పటికే అవసరమైన శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.బెన్‌షాలోమ్, కె.గంగాధర్, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరచారి తదితరులు పాల్గొన్నారు.

భారత సైన్యానికి నిపున్ ఆర్డర్ అందజేత

మోటకొండూర్ : యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలంలోని కాటేపల్లి గ్రామంలో గల ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ లిమిటెడ్‌కు భారత సైన్యం యాంటీ పర్సనల్ బ్లాస్ట్ నిపున్ మైన్స్‌ను ఆర్డర్ ఇచ్చింది. ఇందులో భాగంగా మొదటి విడతలో 41వేల నిపున్లను తయారు చేసి బుధవారం భారత సైన్యాన్నికి అప్పగించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఆర్‌డీఈ డైరెక్టర్ అంకతి రాజు హాజరై మాట్లాడారు. అనంతరం నిపున్ ఆర్డర్లు కలిగిన వాహనాలను ఆయన జెండా ఊపి భారత సైన్యానికి తరలించారు. కార్యక్రమంలో ఏఆర్‌డీఈ సైంటిస్ట్ హరికృష్ణన్, ఎక్స్‌ప్లోజివ్స్ మేనేజింగ్ డైరెక్టర్ టీవీ.చౌదరి, వై.దుర్గాప్రసాదరావు, లెఫ్టినెంట్ జనరల్ పీఆర్ కుమార్ ఉన్నారు.